సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 12 । మార్చి । 2023



జోగింపేటకి జాతీయ పురస్కారం!

సీతానగరం మండలంలోని జోగింపేట పంచాయతీ జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తెలిపారు. - 8లో



ఉపముఖ్యమంత్రిని కలిసిన పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ శనివారం కలిశారు. - 8లో



పరారైన రిమాండ్ ఖైదీ అరెస్ట్

సరిగ్గా రెండు నెలల క్రితం పోలీసుల కళ్లుగప్పి, తప్పించుకుని పరారైన రిమాండ్ ఖైదీని రాజాం పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

టూరిజం కేంద్రంగా నర్సరీ



ఉద్యానవన నర్సరీ పరిశీలిస్తున్న జేసీ ఆనంద్

సీతంపేట: స్థానికంగా ఉన్న ఉద్యానవన నర్సరీని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. సీతంపేట ఐటీడీఏకు శనివారం వచ్చిన ఆయన పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. తురాయిపువలసలో ఉన్న నర్సరీని పరిశీలించారు. అక్కడ జీడి, మామిడి ఇతర మొక్కలు అంటుకట్టడాన్ని పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఉన్న జిమ్‌ను చూశారు. సుందరంగా జిమ్‌ను తీర్చిదిద్దారని యువత సద్వినియోగం చేసుకునేలా ప్రేరణ కలిగించాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ బి.నవ్య, డీపీఓ సతీష్ ఉన్నారు.

వేసవి దృష్ట్యా తస్మాత్...

- డీఐఓ జగన్‌మోహనరావు



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్ : వేసవికాలం దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. బాలగుడబ గ్రామం ఎర్ర చెరువు వద్ద ఉపాధి హామీ కార్మికులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ తదితర ద్రావణాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని, నూనె, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలని, ఇవి శరీరంలో నీటి శాతం తగ్గిస్తాయని తద్వారా డీహైడ్రేషన్‌కు గురవుతామన్నారు. వృద్ధులు, నవజాత శిశువులు, గర్భిణుల విషయంలో మరింత జాగ్రతలు అవసరమని వీలైనంత వరకు నీడగా, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.తాతబాబు, ఏఎన్ఎమ్ రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుభద్రమ్మవలస పరిసర ప్రాంతాలలో ఏనుగులు



సుభద్రమ్మవలస వద్ద జొన్న పంట నుండి పామాయిల్ తోటలోకి వస్తున్న ఏనుగు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస – వెంకటరాజపురం గ్రామాల మధ్య ఉన్న అరటి, పామాయిల్, జొన్న పంట పొలాల్లో ఏనుగులు శనివారం ఉదయం నుండి సంచరిస్తున్నాయి. అటవీ శాఖాధికారులు ఏనుగులు సంచరించే ప్రదేశాలలో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులను రెచ్చగొట్టవద్దని అటవీ సిబ్బంది హెచ్చరిస్తున్నారు.

ఐటీడీఏలో వార్షిక తనిఖీ

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం వార్షిక తనిఖీ చేపట్టారు. వివిధ శాఖల రికార్డు లను పరిశీలించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, వైటీపీ, హార్టీకల్చర్ తదితర శాఖలకు సంబంధించిన పథకాల అమలు తీరు, వెచ్చించిన నిధులు, ఖర్చులు వంటి రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య, ఏపీఓ రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ
ఎన్నికల ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టభద్రులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికార యంత్రాంగం కోరింది.



పోలింగ్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- రేపే పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి కౌంట్‌డౌన్ మొదలైంది. పోలింగ్‌కు ఒక్క రోజే గడువు ఉండడంతో పార్టీలు, ఏజెంట్లు ఇతర వ్యవహారాలపై దృష్టి సారించగా, అధికారులు పోలింగ్ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శనివారంతో ప్రచారం ముగిసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందుండగా మిగిలిన అభ్యర్థులు ప్రచారంలో ఉన్నప్పటికీ ప్రజల నుంచి అంతంతమాత్రంగానే స్పందన లభించింది.

ముగిసిన ఎన్నికల ప్రచారం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఇప్పటివరకు అభ్యర్థులు ప్రచారాన్ని నిర్వహించుకుంటూ వచ్చారు. పోలింగ్‌కు కేవలం ఒక్కరోజే గడువు ఉండడంతో ఏజెంట్ల నియామకం, ఇతర పనుల్లో అభ్యర్థులు నిమగ్నమాయ్యరు.



పార్వతీపురంలో మూసివున్న మద్యం షాపు

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ముందంజ

పార్వతీపురం మన్యం జిల్లాలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్ తరపున ఆ పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేశాయి. పార్వతీపురం మన్యం కేంద్రంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో పాటు నియోజకవర్గ పరిశీలకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు విస్తృత ప్రచారం చేశారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు పోలింగ్ ఏర్పాట్లుపై దృష్టి సారించారు. ప్రధానంగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడం, బారికేడ్లు, ఇతర పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కింద స్థాయి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 15 మండలాల్లో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో 18,250 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 12,516 మంది పురుషులు, 6,002 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 37మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మార్చి 13న జిల్లాలోని ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

పటిష్ట బందోబస్తు



శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల వారీగా విభజించి హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, సాధారణ పోలింగ్ కేంద్రాల ప్రక్రియ పూర్తి చేశాం. జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాలను సున్నితమైన కేంద్రాలుగా గుర్తించాం. అభ్యర్థులు మినహా పోలింగ్ కేంద్రాలకు ఇతరులు ఎవరూ వెళ్లకుండా ఆదేశాలు జారీ చేశాం. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలను నిలుపుదల చేసేలా దిశా నిర్దేశం చేశాం. శనివారం సాయంత్రం నుంచి మద్యం విక్రయాలను నిలుపుదల చేశాం. బల్క్‌గా మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. రూ.10లక్షలకు మించిన నగదు లావాదేవీలపై దృష్టి సారించాం. నాలుగు అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం.

– వి.విద్యాసాగర్‌నాయుడు, ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలింగ్‌కు సంబంధించి ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో ఎక్కడికక్కడే అన్ని చర్యలు చేపడుతున్నాం. బ్యాలెట్ బాక్సులు కేంద్రాలకు చేరవేయడం మొదలుకొని సిబ్బంది నియామకం పూర్తి చేశాం. ఫిబ్రవరి 27న సూక్ష్మ పరిశీలకులకు, సాధారణ పరిశీలకులకు, ఫిబ్రవరి 28న పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. మార్చి 12న పట్టభద్రుల ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తాం. అర్హత గల ప్రతీ ఒక్కరు ఓటును వినియోగించుకోవాలి. ఓటును వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేవారు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకువెళ్లాలి. 13న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

విహారం.. విషాదం



దుర్గాసతీష్ (ఫైల్)



స్థానికులు, విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

- సముద్రంలో గల్లంతైన బి.ఫార్మసీ విద్యార్థి మృతి
- రాళ్లపేట బీచ్‌లో ప్రమాదం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల విహారం విషాదంగా మారింది. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ రెండో ఏడాది చదువుతున్న 12 మంది విద్యార్థులు శనివారం మధ్యాహ్నం డి.మత్స్యలేశం పంచాయతీ రాళ్ల పేట బీచ్‌కు సరదాగా వెళ్లారు. వీరిలో ఇద్దరు ఒడ్డున కూర్చోగా..పది మంది స్నానాల కోసం సముద్రంలోకి దిగారు. అంతలో వారిలో ఇద్దరు లోపలకు కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న కొందరు మత్స్యకారులు దీన్ని గమనించి వెంటనే సముద్రంలోకి దిగి ఆకుల గణేష్ అనే విద్యార్థిని బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అతనిది విజయనగరం పట్టణం. అయితే గల్లంతైన మరో విద్యార్థి నిడదవోలు దుర్గాసతీష్ చౌదరి(21)ని రక్షించడం వారి వల్ల కాలేదు. ఎంత వెతికినా లాభం లేకపోవడంతో మోటారు బోట్లు, వలలు తీసుకువచ్చి గాలించారు. 30 నిమిషాల తర్వాత సతీష్ మృతదేహం వలకు చిక్కింది. ఒడ్డుకు తీసుకు వచ్చేసరికే ప్రాణాలు లేవని గుర్తించారు. అయినా 108కు సమాచారం ఇచ్చారు. వాహన సిబ్బంది సైతం చూసి ప్రాణాలు లేవని చెప్పారు. మృతుడు పార్వతీపురానికి చెందిన వాడు. విద్యార్థులంతా కాలేజీ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో సరదాగా గడుపుదామని వచ్చి ఇలా విషాదంలో చిక్కుకున్నారు. సతీష్ మృతి చెందిన విషయాన్ని స్నేహితులు అతని తల్లిదండ్రులకు చేరవేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యానారాయణ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల కేటాయింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశించారు. ఎన్నికల విధుల్లోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను రాండమ్‌గా కేటాయించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ఎన్ఐసీ డీఐఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పోలింగ్ రోజున కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నిక అధికారిణి ఎ.సూర్యకుమారి తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఇంటర్మీడియెట్ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలగకూడదని, పరీక్ష కేంద్రాలలో మంచినీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు రవాణా సదుపాయాలు కల్పించాలని, ఉదయం 8 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. 9 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయవలసినదిగా పోలీసు శాఖను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల సంఖ్యను పెంచాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షను అమలు చేయాలని, పరీక్ష పేపర్లు తీసుకొని వచ్చినపుడు, సమాధాన పత్రాలు తీసుకువెళ్లినపుడు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో క్యాంపు ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ ఎ.సుభాష్, జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి డి.మంజులవీణ పాల్గొన్నారు.

ఏపీ ఈఆర్‌సీ లైసెన్స్‌ను తిరస్కరించింది



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- లైసెన్స్ ఇవ్వాలనే ప్రభుత్వం సిఫారసు చేసింది
- కాలానికి అనుగుణంగా సంస్కరణలు సహజం
- చీపురుపల్లి ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం
- మరోసారి ప్రభుత్వం, ఏపీ ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్తాం..
- టీడీపీ అర్థం లేని ఆరోపణలు మానుకోవాలి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్)కు లైసెన్స్ తిరస్కరణ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిటీ(ఏపీ ఈఆర్‌సీ) నిర్ణయమని, ఆర్ఈసీఎస్‌కు లైసెన్స్ ఇవ్వాలని ప్రభుత్వం సిఫారసు చేసిందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. శతశాతం విద్యుదీకరణ లక్ష్యాలతో ఆర్ఈసీఎస్ నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిందన్నారు. అందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో 2004 నుంచి ఇంతవరకు ఆర్ఈసీఎస్ పరిధిలో వినియోగదారులకు, రైతులకు ఎంతో ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆర్ఈసీఎస్ పరిధిలో 8 విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నామని, 8717 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రైతులకు ఇవ్వగలిగామన్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి హయాంలో రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుద్దీకరణ యోజన(ఆర్‌జీజీవీవై) పథకంలో భాగంగా రూ.8 కోట్ల నిధులతో విద్యుత్ పరమైన అభివృద్ధి పనులు జరుపుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఆర్ఈసీఎస్‌కు లైసెన్స్ పునరుద్ధరించాలని స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి అనుమతుల కోసం ఏపీ ఈఆర్‌సీకు ప్రభుత్వం సిఫారుసు చేసిందన్నారు. శతశాతం విద్యుద్దీకరణ పూర్తవ్వడం, ఆర్థిక భారం, లాభ నష్టాలు, ఇతర కార్యకలాపాలు దృష్ట్యా ఏపీ ఈఆర్‌సీ లైసెన్స్ మంజూరును నిరాకరించిందన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఏపీ ఈఆర్‌సీ నిర్ణయాన్ని గౌరవించాల్సి ఉందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఒకటే ఎలక్ట్రిక్ బోర్డు ఉండగా దానిన్ని రెండుగా విభజించి ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కోలుగా మార్చిన విషయాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఆర్ఈసీఎస్‌కు లైసెన్స్ మంజూరు విషయంలో ఏపీఈఆర్‌సీ ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిందని, అయినప్పటికీ రాష్ట్రంలో ఉన్న మూడు ఆర్ఈసీఎస్‌ల్లో ఆర్థిక భారం దృష్ట్యా లైసెన్స్ తిరస్కరించిందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 31 మండలాల్లో ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ సేవలు అందుతుండగా చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో మాత్రమే ఆర్ఈసీఎస్ విద్యుత్ సేవలు అందుతున్నాయని చెప్పారు. చీపురుపల్లి ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వమని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ద్వారా మరోసారి ప్రభుత్వం, ఏపీఈఆర్‌సీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కెవి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, సువ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలకు సెలవు

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం పట్టభద్రుల నియోజకవర్గానికి 13వ తేదీన ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలకు మార్చి 12, 13 తేదీలలో ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేటు నిషాంత్‌కుమార్ శనివారం తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికలు, వీరఘట్టం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర) సీతంపేట, జిల్లా పరిషత్ హైస్కూలు, భామిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమరాడ, ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్, (బాలుర) భద్రగిరి, గుమ్మలక్ష్మీపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కురుపాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస, జిల్లా పరిషత్ హైస్కూలు, గరుగుబిల్లి, డీవీఎం హైస్కూల్, బెలగాం, గవర్నమెంటు జూనియర్ కళాశాల, పార్వతీపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మక్కువ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బలిజిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాలూరు, పాచిపెంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పోలింగ్ ముందురోజు, పోలింగ్ రోజు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

10 గడ్డివాముల దగ్ధం



తగలబడిపోతున్న గడ్డివాములు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో 10 గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయంత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన శీర కాశినాయుడు, పైడినాయుడు, బిక్కిని వెంకన్నబాబు, యండమూరి త్రినాధ తమ పశువుల మేత కోసం సమీపంలోని కళ్లాల్లో గడ్డివాములు నిల్వచేశారు. అక్కడే ఉన్న విద్యుత్ తీగల కారణంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి గడ్డివాములు కాలిపోయాయి. అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పివేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

చింతచెట్టు పైనుంచి జారిపడి యువకుడి మృతి



అప్పారావు(ఫైల్)

సీతంపేట: చింతచెట్టు పైనుంచి జారిపడి ఊయక అప్పారావు(37) అనే యువకుడు మృతి చెందిన విషాద ఘటన మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మర్రిగూడ చెందిన అప్పారావు చింతబొట్టల కోసం వెలగాపురంలోని చింతచెట్టు ఎక్కాడు. బొట్టలు తీసిన తర్వాత చెట్టు దిగుతున్నప్పుడు ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు దోనుబాయి ఎస్‌ఐ కిశోర్ వర్మ తెలిపారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

సమర్థవంతంగా టీకాల పంపిణీ

పూసపాటిరేగ: టీకాల పంపిణీ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా టీకా అధికారి డాక్టర్ జగదీష్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిల్వ ఉన్న వ్యాక్సిన్లు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలో టీకాలు వేసుకునే విధంగా హెల్త్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమియాలజిస్ట్ సూర్యతేజ, వైద్యాధికారి రాజేష్‌వర్మ, సీహెచ్‌ఓ వేదమణి, సిబ్బంది గణపతి, ఆర్‌వీ రమణ, బంగారుబాబు పాల్గొన్నారు.

గుణుపూరుపేటలో వైద్యశిబిరం



గుణుపూరుపేటలో రక్తదానం చేస్తున్న యువకులు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో రోగులు పాల్గొని వైద్యసేవలు పొందారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ఒక ఏడాది పాటు ఉచిత ప్రమాద బీమా చేయించామని విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల ముత్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామునాయుడు, ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, విజయ్, రఘు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- రేపే ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్థానికసంస్థల పోలింగ్ కేంద్రం
- మిగిలిన మండలాల్లో పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం



పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్/వీరఘట్టం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సజావుగా జరిగేలా కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం చేపట్టారు. నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పూర్తి సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. నియోజకవర్గంలోని పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల్లో ఆయా మండలాల తహసీల్దార్లు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఇప్పటికే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానికసంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలాల వారీగా పట్టభద్రులు, ఉపాధ్యాయులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులంతా తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల ఎన్నికల ఉన్నతాధికారుల నుంచి అందించిన ఓటరు జాబితాలను మండలాల వారీగా ఎంపీడీఓలకు అందించారు. ఇప్పటికే ఓటర్లకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయింది.

144 సెక్షన్ అమలు..

పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళి-30 యాక్ట్‌లో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఇద్దరు చొప్పున విధుల్లో ఉంటారు. పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి, పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ పాలకొండ, రాజాం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులంతా తమ ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

గుర్తింపు కార్డు తీసుకురావాలి..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు వేసేందుకు వచ్చేవారంతా ఓటరు స్లిప్‌తో పాటు తప్పకుండా ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. సాయంత్రం 4 గంటల లోపు ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల ఫొటో, పేరు మాత్రమే ఉంటుంది. ఓటరు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయవచ్చు. అభ్యర్థి పేరుకు ఎదురుగా కేటాయించబడిన గడిలో ప్రాధాన్యతా నంబర్ రాయాల్సి ఉంటుంది.

స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలిలా ఉన్నాయి..

క్రమ సంఖ్య	మండలం పేరు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	వార్డు మెంబర్లు	ఎమ్మెల్యేలు	ఓటర్లు
1	పాలకొండ	12	1	-	-	13
2	వీరఘట్టం	19	1	-	1	21
3	సీతంపేట	16	1	-	-	17
4	భామిని	13	1	-	-	14
5	పాలకొండనగర పంచాయతీ	-	-	20	-	20
6	రాజాం	14	1	-	1	16
7	రేగిడి ఆమదాలవలస	18	1	-	-	19
8	వంగర	12	1	-	-	13
9	సంతకవిటి	19	1	-	-	20
	మొత్తం	123	8	20	2	153

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలిలా..

క్రమ సంఖ్య	మండలం	పోలింగ్ కేంద్రాల సంఖ్య	ఓటర్ల సంఖ్య
1	వీరఘట్టం	జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వీరఘట్టం-01	1319
2	సీతంపేట	జీటీడబ్ల్యూ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, సీతంపేట-02	868
3	భామిని	జెడ్పీ ఉన్నత పాఠశాల, భామిని-03	570
4	పాలకొండ	ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూమ్ నంబర్-01, పాలకొండ-23	1166
		ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూమ్ నంబర్-07, పాలకొండ-24	1094

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి..



స్థానికసంస్థల ఎన్నికలకు సంబంధించి, పాలకొండ నియోజకవర్గానికి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఓటర్లు అయిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లంతా ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి.

– సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, పాలకొండ

జోగింపేట పంచాయతీకి జాతీయ పురస్కారం!



మాట్లాడుతున్న సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలోని జోగింపేట పంచాయతీ జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు సర్పంచ్ కల్యంపూడి సింహాచలం తెలిపారు. శనివారం ఇదే విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన గ్రామంలోని ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు జరగడంతో ఈ గౌరవం దక్కిందన్నారు. దీనికి కారకులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు కృతజ్ఞతలన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ముందు కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి, గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

పార్వతీపురం: గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలుకు చెందిన టి.శ్రీను అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం సద్దన్నం(చల్లంది) తిన్న తర్వాత పురుగుమందు తాగాడు. ఇదే విషయాన్ని ఆయన తన భార్య జానకికి తెలిపాడు. అప్రమత్తమైన ఆమె చుట్టుపక్కల వాళ్లను పిలిచి, మందు కక్కించే ప్రయత్నం చేసింది. అ నంతరం వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఉపముఖ్యమంత్రిని కలిసిన పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్



డిప్యూటీ సీఎంను సన్మానిస్తున్న నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ

సాలూరు: స్థానిక పట్టణంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తానన్నారు. అనంతరం పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, డీసీఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ తదితరులు విక్రమ్‌ను సన్మానించారు. అంతకుముందు డిప్యూటీ సీఎంను కూడా సత్కరించారు.

సాలూరు: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం రాజన్నదొరతో పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ విక్రమ్

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన అవనాపు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన అవనాపు విక్రమ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. మూడు జిల్లాల యూత్ వింగ్ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి, పార్టీ పెద్దలకు అవనాపు విక్రమ్ ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అవనాపు విక్రమ్‌ను శ్రీనివాసరావు సూచించారు.



మజ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న అవనాపు విక్రమ్

పరారైన రిమాండ్ ఖైదీ అరెస్ట్



పట్టుబడిన రిమాండ్ ఖైదీతో పోలీసులు

రాజాం సిటీ: సరిగ్గా రెండు నెలల క్రితం పోలీసుల కళ్లుగప్పి, తప్పించుకుని పరారైన రిమాండ్ ఖైదీని రాజాం పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేశారు. సదరు ఖైదీని శనివారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల ఎదుట హాజరుపరిచి, సీఐ కె.రవికుమార్ వివరాలు వెల్లడించారు. చీపురుపల్లి మండలంలోని పత్తికాయపాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబును విజయనగరం వన్‌టౌన్‌లో కేసు నిమిత్తం జనవరి 12వ తేదీన పాలకొండ సబ్‌జైలు నుంచి విజయనగరం కోర్టులో హాజరుపరిచారు. తిరిగి అదేరోజు సాయంత్రం పాలకొండ సబ్‌జైలుకు తరలిస్తుండగా రాజాం బస్టాండ్‌లో పోలీసులను తప్పించుకుని పరారయ్యాడు. ఈ మేరకు అతడికి ఎస్కార్ట్‌గా వచ్చిన సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అప్పటి నుంచి రాంబాబుపై నిఘా ఉంచి, అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా, స్థానికుల సహాయంతో అతడిని పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. అక్కడి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ వై.రవికిరణ్, సిబ్బందిని పంపించి, అరెస్ చేసి ఇక్కడికి తీసుకువచ్చామన్నారు. అతడిపై గతంలో రాజాం, చీపరుపల్లి, విజయనగరం వన్‌టౌన్, జామి, ఎస్.కోట పోలీస్‌స్టేషన్ల పలు దొంగతనాలకు సంబంధించి, కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఖైదీని రాజాం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ విధించడంతో పాలకొండ సబ్‌జైలుకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వై.రవికిరణ్, వీబీ రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికే మద్దతు

- వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



హనుమతు లజపతిరాయ్

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ తమ మద్దతని జాయిన్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఫర్ ఆంధ్రప్రదేశ్ పరిపాలనా వికేంద్రీకరణ మద్దతు తెలిపింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్టణాన్ని రాజధానిగా వద్దని ప్రచారం చేసే అన్ని రాజకీయ పార్టీల ఆలోచ న విధానానికి మూడు రా జధానుల ఐక్య కార్యాచరణ కమిటీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ విశాఖపట్టణాన్ని రాజధానిగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కే ఓటు వేస్తామని తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు



డ్రోన్ల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ప్రతినిధులు

డెంకాడ: డ్రోన్ టెక్నాలజీతో భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీనియర్ యూఏవీ ఇంజినీర్ అండ్ డీజీసీఏ సర్టిఫైడ్ ఆర్పీఏ ఇన్‌స్ట్రక్టర్ మామిడి శ్రీనివాస్ అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో డ్రోన్ టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ల తయారీ సంస్థ మారుత్ డ్రోన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరై మాట్లాడారు. డ్రోన్లలోని రకాలు, వాటి పనితీరును వివరించారు. వివిధ రకాల వ్యవసాయ, రక్షణ రంగాల్లో డ్రోన్ల సేవలను తెలియజేశారు. డ్రోన్ టెక్నాలజీ కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, నిర్వాహకులు ఎం.రాజన్‌బాబు, ఏవీ పరాంకుశం, శ్రీధర్, నరేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200